ఉపాధి కల్పనే ధ్యేయంగా శిక్షణ



వీసీలో పాల్గొన్న కలెక్టర్ రాహుల్ శర్మ, అధికారులు

భూపాలపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే: యువతకు ఉపాధి కల్పనే ధ్యేయంగా అడ్వాన్స్‌డ్ కేంద్రాల ద్వారా శిక్షణ ఇవ్వనున్నట్లు ఉపాధి కల్పన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సంజయ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్‌తో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ అధునాతన శిక్షణ కేంద్రాల్లో ప్రవేశాల ప్రక్రియ పర్యవేక్షణకు డీపీవో, డీఆర్డీవోలను ప్రత్యేక నోడల్ అధికారులుగా నియమించినట్లు తెలిపారు. భూపాలపల్లిలో నిర్మిస్తున్న ఆధునిక శిక్షణ కేంద్రం నిర్మాణం బేస్‌మెంట్ స్థాయిలో ఉందని.. కాటారంలో కేటాయించిన భూమి అనువుగా లేకపోవడంతో నిర్మాణ వ్యయం పెరిగే అవకాశం ఉన్నందున పనులు జరగడం లేదన్నారు. ప్రత్యామ్నాయంగా భూమి కేటాయింపునకు చర్యలు తీసుకుంటామని.. పనులు వేగవంతం చేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో శిక్షణ కేంద్రం ప్రిన్సిపల్ తదితరులు పాల్గొన్నారు.

17 గ్రూప్-3 పరీక్ష కేంద్రాలు: గ్రూప్-3 పరీక్షల నిర్వహణకు ఎంపిక చేసిన కేంద్రాల్లో ఆన్ లైన్ నమోదుపై టీజీపీఎస్సీ ఛైర్మన్ మహేందర్‌రెడ్డి నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాహుల్ శర్మ పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గ్రూప్-3 పరీక్షలకు సంబంధించి 17 కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పరీక్షా పేపర్లు భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూములు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, అదనపు ఎస్పీ బోనాల కిషన్, ఆర్ఎస్ఐ డీఎస్పీ నారాయణ, పరీక్ష పర్యవేక్షణ కో ఆర్డినేటర్ వెంకన్న, పరీక్షల కో ఆర్డినేటర్ అనిల్‌కుమార్, కలెక్టరేట్ ఏవో ఖాజా మొహియొద్దీన్ పాల్గొన్నారు.

పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

ఏటూరునాగారం, న్యూస్‌టుడే: ఏటూరునాగారం ఐటీడీఏ ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని డిగ్రీ ఉత్తీర్ణులైన గిరిజన నిరుద్యోగ యువత, గతంలో ఉచిత శిక్షణ పొందని వారికి ప్రభుత్వ ఉద్యోగ నియామక పోటీ పరీక్షలు రాసేందుకు ఉచిత శిక్షణ అందించనున్నట్లు ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా తెలిపారు. అర్హులైన ఆసక్తి కలిగిన అభ్యర్థులు www.studycircle.cgg.gov.in వెబ్‌సైట్‌లో ఈ నెల 27వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వడపోత పరీక్ష నిర్వహించి ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. గిరిజన నిరుద్యోగ యువత ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు పనిదినాల్లో 8374417424, 9441003400 నెంబర్లలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల్లోగా సంప్రదించాలని పేర్కొన్నారు.

మావోయిస్టుల కదలికలపై నిఘా

వెంకటాపురం: తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలని ములుగు ఎస్పీ డాక్టర్ శబరీష్ ఆదేశించారు. వెంకటాపురం పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం ఆయన వార్షిక పరిశీలనలో భాగంగా తనిఖీ చేశారు. దస్త్రాలను పరిశీలించి కేసుల నమోదు, వాటి పురోగతిని అడిగి తెలుసుకున్నారు ఎస్పీ పోలీసు అధికారులు, సిబ్బందికి పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. మావోయిస్టుల కదలికలపై నిఘాను తీవ్రతరం చేయాలన్నారు. అదే క్రమంలో ప్రజలకు భద్రతతో కూడిన భరోసా ఇచ్చేలా ప్రణాళికలు ఉండాలని, అంతరాష్ట్ర సరిహద్దున ఉన్న ఈ ప్రాంతంలోకి గంజాయి రవాణాను పూర్తిస్థాయిలో నియంత్రించాలని సూచించారు. గుడుంబా అమ్మకాలు, అక్రమ రవాణా, తయారీపై కొరడా ఝుళిపించి అరికట్టాలని ఆదేశించారు. రవాణాకు ఆటంకం కలిగించేలా రహదారులపై నిలిపే ఇసుక లారీ యజమానులు, డ్రైవర్లపై కేసులు నమోదు చేయాలన్నారు. ఆయనతో పాటు సీఐ బండారి కుమార్, ఎస్సై కొప్పుల తిరుపతిరావు, శిక్షణ ఎస్సై ఆంజనేయులు ఉన్నారు.

మార్పు కోసం.. మన పాలనాధికారులు





దుగ్గొండి బాలుర వసతిగృహంలో ఫిర్యాదుల పెట్టెను తెరుస్తున్న విద్యార్థులు

వినూత్న ఆలోచనలతో ముందడుగు

ఉమ్మడి వరంగల్ పరిధిలోని ఆరు జిల్లాల్లో పాలనాధికారులు వినూత్న కార్యక్రమాలతో అభివృద్ధికి బాటలు వేస్తున్నారు.. ప్రజల హృదయాలను గెలుచుకుంటున్నారు. పాలనలో తమదైన ప్రత్యేక ముద్ర వేస్తూ కీలకమైన విద్య, వైద్య రంగాల్లో మార్పులకు శ్రీకారం చుట్టారు. ముఖ్యంగా ములుగు, జనగామ, వరంగల్ పాలనాధికారులు రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా చేపట్టిన కార్యక్రమాలు స్ఫూర్తిగా నిలుస్తున్నాయి.

విద్యార్థుల ఉన్నతిలో 'కీ'రోల్

జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ వసతిగృహాలు, కస్తూర్బా విద్యాలయాలు, గురుకులాల్లోని విద్యార్థుల ఉన్నతిపై **వరంగల్ పాలనాధికారి డా.సత్యశారద** దృష్టి సారించారు. వారి సమస్యలు తెలుసుకునేందుకు వసతిగృహాలు, గురుకులాల్లో ఫిర్యాదుల పెట్టెలను ఏర్పాటుచేశారు. వాటి తాళాలు ఆమె వద్దే ఉంటాయి. విద్యార్థులు తమ సమస్యలను చీటీల్లో రాసి పెట్టెలో వేస్తున్నారు. ఎవరు ఫిర్యాదు చేశారో వార్డెన్, ఇతర సిబ్బందికి తెలియనీయకుండా.. విద్యార్థుల డార్మెంటరీలలోనే వాటిని ఏర్పాటుచేశారు. ఆకస్మిక తనిఖీల సమయంలో పాలనాధికారి పెట్టెలను తెరిచి సమస్యలు తెలుసుకుంటున్నారు. పరిష్కార దిశగా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేస్తున్నారు. దాంతో వసతిగృహాలు, గురుకులాల సిబ్బంది విద్యార్థులకు అందించే భోజనాలు, శుభ్రతపై అప్రమత్తంగా ఉంటున్నారు. ● ఫిర్యాదుల పెట్టె ద్వారా విద్యార్థులు కోరినట్లు నవంబరు 15 లోగా దుప్పట్లు పంపిణీ చేస్తామని పాలనాధికారి తెలిపారు.

–వరంగల్ కలెక్టరేట్, న్యూస్‌టుడే



ఆసుపత్రిలో రిజిస్టర్ పరిశీలిస్తూ..



ప్రతి సమస్య నమోదుకు ప్రత్యేక పుస్తకం

హనుమకొండ పాలనాధికారి ప్రావిణ్య వినూత్నంగా ఆలోచించి ఏటీఆర్ (యాక్షన్ టేకెన్ రిపోర్ట్) బుక్ ఏర్పాటు చేశారు. ఎవరైనా కలెక్టర్‌కు నేరుగా దరఖాస్తు ఇచ్చినా, తాను క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్లినప్పుడు అక్కడ ఉన్న సమస్యలేమిటో ఆరా తీస్తున్నారు. వాటిని పరిష్కరించేందుకు ఏం చేయాలి.. తన పరిధిలో చేయెుచ్చా..పై అధికారులతో మాట్లాడాల్సి వస్తుందా... ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేలా.. ఇలా ప్రతి పనికి సంబంధించి పూర్తి వివరాలతో కలెక్టరేట్‌లో ఏటీఆర్ బుక్‌లో నమోదు చేసి ఆన్ లైన్ చేయిస్తున్నారు. ప్రతి శనివారం సంబంధిత అధికారులతో సమీక్షిస్తున్నారు. ఫలితంగా ఆయా పనులు పరిష్కారం దిశగా సాగుతున్నాయి. ● ఏటీఆర్‌లో నమోదైన సమస్యలపై సమీక్షిస్తూ పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాని పాలనాధికారి ప్రావిణ్య పేర్కొన్నారు. –న్యూస్‌టుడే, హనుమకొండ కలెక్టరేట్

వాట్సప్ హాజరు గ్రూపులతో గైర్హాజరుకు ముకుతాడు



ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది సకాలంలో హాజరు కావడం లేదని **జనగామ పాలనాధికారి రిజ్వాన్ బాషా** ఆకస్మిక తనిఖీల్లో వెల్లడైంది. దీంతో ఆయన తనతో పాటు డీఎంహెచ్ఓ, ఇతర వైద్యాధికారులు, అన్ని పీహెచ్‌సీల వైద్యులు, అన్ని విభాగాల సిబ్బందితో ఒక వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేశారు. పీహెచ్‌సీ సీహెచ్‌సీల్లో ప్రతి రోజూ విధులకు హాజరయ్యే వైద్య, సిబ్బంది విధుల్లోకి వచ్చిన, వెళ్తున్న సమయంలో ఆ గ్రూప్‌లో ఫొటో పోస్టు చేసేలా చర్యలు చేపట్టారు. ఆ రోజు ఎంత మందికి ఓపీ చూశారు, ఎంత మంది ఇన్‌పేషెంట్లకు వైద్యం చేశారనే వివరాలను పొందుపరుస్తున్నారు. ఈ గ్రూప్‌ను డీఎంహెచ్‌వో రవీందర్ గౌడ్ పర్యవేక్షిస్తుంటారు. పాలనాధికారి కూడా ప్రతి రోజూ పీహెచ్‌సీల వారీగా పరిశీలిస్తూ తన అభిప్రాయాలను పోస్టు చేస్తున్నారు. పాలనాధికారే గ్రూప్‌లో ఉంటూ గమనిస్తుండటంతో అన్ని ఆరోగ్య కేంద్రాల్లో వైద్య, సిబ్బంది మెరుగైన హాజరు కనిపిస్తోంది.



విధుల్లో ఉన్నామంటూ వాట్సప్ గ్రూపులో వివరాలు నమోదు చేస్తున్న వైద్య సిబ్బంది

పాఠశాలల్లో సైతం: జులైలో 600 మంది ఉపాధ్యాయులు సెలవులు పెట్టారని తెలుసుకున్న పాలనాధికారి విద్యాశాఖలోనూ ప్రక్షాళన ప్రారంభించారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులతో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేయించారు. రోజూ హాజరు శాతం పోస్టు చేసేలా చర్యలు చేపట్టారు.

● రాష్ట్రంలో జనగామను ఆదర్శ జిల్లాగా ముందు వరుసలో ఉంచాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నామని పాలనాధికారి రిజ్వాన్ బాషా తెలిపారు.

–న్యూస్‌టుడే, జనగామ టౌన్

కంటెయినర్ ఆసుపత్రితో చేరువైన వైద్యం, విద్య



ములుగు జిల్లాలోని ఏజెన్సీ గ్రామాల ప్రజలు సరైన రహదారి లేక అవస్థలు పడుతుంటారు. వర్షాకాలం విద్య, వైద్యం అందని పరిస్థితులు. **ములుగు పాలనాధికారిగా టీఎస్ దివాకర** జూన్‌లో బాధ్యతలు తీసుకున్నారు. మంత్రి సీతక్క ఇక్కడి సమస్యలకు పరిష్కార మార్గం చూపాలని ఆయన్ను కోరారు. ఆయన జిల్లాలోని పలు ప్రాంతాలను సందర్శించి కంటెయినర్ ఆసుపత్రి ఆలోచనను మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లారు. ఆమె సూచనలతో తాడ్వాయి మండలం పోచాపూర్ గ్రామంలో కంటెయినర్ ఎక్స్‌టెన్షన్ కౌంటర్(కంటెయినర్ ఆసుపత్రి) ఏర్పాటు చేయించారు. నర్సాపూర్, అల్లిగూడెం, బందాల, బొల్లెపల్లి గ్రామాలకు కూడా దీని ద్వారా వైద్యసేవలు అందిస్తున్నారు. వాజేడు మండలం ఎడ్జర్లపల్లిలోనూ ఏర్పాటు చేయించారు. రూ.7 లక్షలు వెచ్చించి తయారు చేయించారు. ఇందులో నాలుగు పడకలు ఉంటాయి. ఏఎన్ఎం, ఆశా కార్యకర్త, హెల్త్ అసిస్టెంటు వైద్య సేవలందిస్తున్నారు.



కంటెయినర్ బడిలో చదువుకుంటున్న విద్యార్థులు

ఇదే స్ఫూర్తితో పాఠశాల..: కన్నాయిగూడెం మండలం బంగారుపల్లి గొత్తికోయ గూడెంలో రూ.13 లక్షలతో పాఠశాల కోసం కంటెయినర్‌ను ఏర్పాటు చేశారు. సోలార్ విద్యుత్తు, డ్యూయెల్ డెస్క్‌లు, ఫ్యాన్లు, నల్లబోర్డు, తదితర వసతులున్నాయి.

● రవాణా సౌకర్యం లేని గ్రామాల్లో సమస్యల శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తున్నామని పాలనాధికారి దివాకర తెలిపారు.

–ఈనాడు, జయశంకర్ భూపాలపల్లి

ప్రతిభావంతులకు చక్కటి వేదిక 'కళా ఉత్సవ్'



విద్యార్థికి ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న డీఈవో రాజేందర్

భూపాలపల్లి, న్యూస్‌టుడే: ప్రతిభావంతులను వెలుగులోకి తీసుకురావడానికి 'కళా ఉత్సవ్' కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని డీఈవో రాజేందర్ అన్నారు. రెండు రోజులుగా నిర్వహిస్తున్న జిల్లా స్థాయి కళా ఉత్సవ్ పోటీలు శుక్రవారం మగిశాయి. క్వాలిటీ కో ఆర్డినేటర్ కాగిత లక్ష్మణ్ అధ్యక్షతన జరిగిన ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఈవో మాట్లాడుతూ.. పట్టణ ప్రాంతాలతో పాటు గ్రామీణ పాఠశాలల్లో విద్యార్థులు చదువుతో పాటు వివిధ కళల్లో రాణిస్తున్నారని. . సరైన వేదిక లేకపోవడంతో వారిలోని ప్రతిభ మరుగున పడుతోందని చెప్పారు. ఈ నేపథ్యంలో ఎన్‌సీఈఆర్టీ, తెలంగాణ సమగ్ర శిక్ష అభియాన్ సంయుక్తంగా కళా ఉత్సవ్ పేరుతో పోటీలు నిర్వహిస్తోందని అన్నారు. వచ్చే నెలలో రాష్ట్ర స్థాయి కళా ఉత్సవాల పోటీలు జరుగుతాయని చెప్పారు. పోటీల్లో ప్రతిభ చూపించిన విద్యార్థులకు డీఈవో బహుమతులు అందించారు. గాత్రం సంగీతంలో ఎన్.వరుణ్(సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయం, చిట్యాల), వాయిద్య సంగీతంలో ఎం.సాత్విక్(జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కాటారం), నృత్యం విభాగంలో కె.బిందూజ(జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జడల్‌పేట), దృశ్య కళలు - ఎం.జగదీశ్వర్(జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గణపురం), సంప్రదాయ కథలు చెప్పడంలో సీహెచ్.శివకుమార్(ప్రభుత్వ ఉన్నత పాఠశాల,మీనాజిపేట), ఆర్ట్స్ విభాగంలో ఎం.రాంచందర్(ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జగ్గయ్యపేట) ప్రథమ బహుమతి సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ మాచర్ల శ్రీధర్, ఏసీజీ మందల రవీందర్‌రెడ్డి, ప్లానింగ్ కో ఆర్డినేటర్ దుప్పటి రాజగోపాల్, సీఎంవో రమేష్, కృష్ణమోహన్ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ పర్యటన నేడు

భూపాలపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే : నేడు(శనివారం) జిల్లాలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య, కమిటీ సభ్యులు పర్యటించనున్నారు. ఉదయం 11 గంటలకు జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించే సమావేశంలో పాల్గొంటారు. జిల్లాలోని అన్ని శాఖల అధికారులు సమావేశానికి సమగ్ర నివేదికలతో సకాలంలో హాజరుకావాలని కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. అలాగే సమావేశ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారికి సూచించారు.

బాల స్వస్థ్య.. అమలు మిథ్య!

న్యూస్‌టుడే, భూపాలపల్లి కలెక్టరేట్

ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని విద్యార్థుల ఆరోగ్యానికి ఇబ్బందులు లేకుండా ఉండేలా రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమం(ఆర్‌బీఎస్‌కే) జాతీయ ఆరోగ్య మిషన్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఆర్‌బీఎస్‌కే బృందం జిల్లాలోని ప్రతి పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను తరచూ సందర్శిస్తూ 0 నుంచి 18 సంవత్సరాల పిల్లలకు అవసరమైన స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహించాలి. పిల్లల్లో కనిపించే స్వల్ప అనారోగ్య లక్షణాలు దీర్ఘకాలిక వ్యాధులుగా మారకుండా ఉండేలా ఆర్‌బీఎస్‌కే బృందాలు చేపడుతున్న స్క్రీనింగ్ పరీక్షలు ఎంతగానో ఉపయోగపడతాయి. పిల్లల్లో ఏవైనా అనారోగ్య లక్షణాలు కనిపిస్తే వెంటనే చికిత్సకు సిఫారసు చేయడానికి ఆస్కారం ఉంటుంది. అలాంటి రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే) జిల్లాలో మొక్కుబడిగా కొనసాగుతోంది. నిత్యం పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించాల్సిన బృందాలు సరిగా పర్యటించకపోవడంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోతోంది.

జిల్లా సమాచారం	
అంగన్‌వాడీ కేంద్రాలు	644
0 నుంచి 6 నెలల చిన్నారులు	1845
7 నెలల నుంచి 3 సంవత్సరాలు	11198
3 నుంచి 6 ఏళ్లు	9148



భూపాలపల్లి మండలంలో విద్యార్థులను పరీక్షిస్తున్న ఆర్‌బీఎస్‌కే బృందం

	● పాఠశాలల సంఖ్య	● నమోదైన విద్యార్థులు
ప్రాథమిక పాఠశాల	328	6622
ప్రాథమికోన్నత పాఠశాల	47	2503
జడ్పీ హెచ్ఎస్, గురుకులాలు	100	13973

మొక్కుబడిగా నిర్వహణ

రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమం(ఆర్‌బీఎస్‌కే) జిల్లాలో మొక్కుబడిగా తమ సేవలను అందిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఆర్‌బీఎస్‌కే బృందం ప్రతి అంగన్‌వాడీ కేంద్రాన్ని సంవత్సరానికి రెండు పర్యాయాలు, పాఠశాలలను ఏడాదికి ఒకసారి సందర్శించాల్సి ఉంటుంది. పిల్లలకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి వారిలో పుట్టుకతో వచ్చే లోపాలు, వ్యాధులు, ఎదుగుదల లోపాలు, విటమిన్ల ద్వారా వచ్చే లోపాలను గుర్తించడంతో పాటు వారికి అవసరమైన మార్గదర్శనం చేసి చికిత్స అందించేలా పని చేయాల్సి ఉంటుంది. ఇందుకు సంబంధించి జిల్లాలో నాలుగు ఆర్‌బీఎస్‌కే బృందాలు పనిచేస్తున్నాయి. ఒక్కో బృందంలో ఇద్దరు వైద్యులు ఒక ఏఎన్ఎం, ఒక ఫార్మసిస్టు విధులను నిర్వహించాల్సి ఉంటుంది. చాలా సమయాల్లో పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల సందర్శనలో వైద్యాధికారులు లేకుండా ఏఎన్ఎంలతోనే స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహిస్తున్నారని.. తద్వారా పిల్లల్లో కనిపించే స్వల్ప అనారోగ్య సమస్యలను గుర్తించలేక.. అవి దీర్ఘకాలిక వ్యాధులుగా మారే ప్రమాదం ఉందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

64 వేలకు పైగా..

జిల్లా వ్యాప్తంగా 12 మండలాలు, 241 పంచాయతీలలో 644 అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహిస్తున్నారు. వాటిలో 22191 మంది 0 నుంచి ఆరేళ్లలోపు పిల్లలు కేంద్రాల్లో నమోదు చేసుకున్నారు. అలాగే జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ గురుకులాలు 538 ఉన్నాయి. వాటిలో 42,125 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరందరికీ ఆర్‌బీఎస్‌కే బృందాల ద్వారా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాల్సి ఉంటుంది. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను సదరు బృందం సందరిస్తున్నా వ్యాధులను నిర్ధారించేలా అవసరమైన స్క్రీనింగ్ పరీక్షలను చేపట్టడం లేదని.. తూతూమంత్రంగా విద్యార్థులను పరిశీలిస్తూ చేతులు దులుపుకొంటున్నారనే అపవాదు ఉంది. ఈ బృందాలు వంద శాతం పనిచేసేలా సంబంధిత అధికారులు కూడా పర్యవేక్షణ చేయాల్సిన అవసరం ఉంది.

షెడ్యూల్ ప్రకారం విధులు నిర్వహించాల్సిందే..

- డాక్టర్ మధుసూదన్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి



ఆర్‌బీఎస్‌కే బృందాలు తమ షెడ్యూల్ ప్రకారం కచ్చితంగా విధులను నిర్వహించాల్సిందే.. ఇటీవల ఆర్‌బీఎస్‌కే అధికారుల బృందంతో సమావేశం ఏర్పాటు చేసి పనితీరుపై సమీక్షించాం. క్షేత్రస్థాయిలో స్క్రీనింగ్ పరీక్షలు చేపడుతున్నా ఫొటోలను అప్‌లోడ్ చేయడంతో పాటు ప్రోగ్రాం అధికారులు కూడా నిత్యం తనిఖీలు చేపట్టాలని ఆదేశించాం. విధులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటాం.

సీసీ రహదారి పనులు ప్రారంభం



భూపాలపల్లి, న్యూస్‌టుడే: పురపాలక సంఘం పరిధిలోని మైసమ్మ కాలనీలో సీసీ రహదారి పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. రెండేళ్లుగా బురద నీటితో గుంతలమయంగా మారిన రోడ్డుపైన కాలనీ ప్రజలు ప్రయాణించాలంటే నిత్యం నరకయాతన అనుభవించారు. జిల్లా కేంద్రంలోని జాతీయ రహదారికి అతి సమీపంలోని కాలనీలో సరికొత్త ఇళ్లు.. ఆధునిక హంగులతో నిర్మాణాలు చేపట్టినా ప్రధానంగా రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందిపడ్డారు. విషయాన్ని మున్సిపాలిటీ అధికారులు, స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లేలా 'ఈనాడు'లో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. ఆగస్టు 14న 'మైసమ్మా.. నీవే దిక్కమ్మా..' శీర్షికన ప్రచురితమైన కథనం కాలనీవాసుల కష్టాలను కళ్లకు కట్టింది. అధ్వానంగా మారిన అంతర్గత రహదారుల తీరుపై మరో కథనం ప్రచురితమైంది. దీంతో అధికారులు స్పందించారు. మరో వైపు. . 20 రోజుల క్రితం మున్సిపాలిటీ ఇంజినీరింగ్ అధికారులతో పాటు గుత్తేదారులతో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు క్యాంపు కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పనులు వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ క్రమంలోనే పురపాలక సంఘం పరిధిలోని 10వ వార్డు ప్రాంతంలోని మైసమ్మ కాలనీలో రోడ్డుపై కంకర పోసి, రోలర్‌తో తొక్కించి చదును చేశారు. మోకాలు లోతు గుంతలను పూడ్చి సీసీ వేయడానికి సిద్ధం చేశారు. మొత్తం 400 మీటర్ల వరకు సీసీ నిర్మాణ పనులకు టీయూఎఫ్‌డీసీ నిధులు సుమారు రూ.50 లక్షలు కేటాయించారు. శుక్రవారం సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించడంతో కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో సీసీ నిర్మాణం పూర్తయితే.. మిగతా ప్లాట్లలో చాలా మంది నూతన ఇళ్ల నిర్మాణాలకు ముందుకురానున్నట్లు పలువురు కాలనీవాసులు తెలిపారు. మరికొద్ది రోజుల్లో సీసీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తయిన తర్వాత అధికారికంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు చేతులమీదుగా ప్రారంభించనున్నట్లు చెప్పారు.

ఈనాడు కథనానికి స్పందన

రామగుండం-మణుగూరు రైల్వే లైన్ పనుల్లో కదలిక


భూసేకరణ ప్రక్రియకు చర్యలు

న్యూస్‌టుడే, భూపాలపల్లి కలెక్టరేట్

కోల్‌బెల్ట్ ప్రాంతాలను కలుపుతూ రైలు మార్గం నిర్మించాలన్న ప్రతిపాదనల్లో వేగం పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. రామగుండం నుంచి మణుగూరు వరకు రైలు మార్గం నిర్మాణానికి దశాబ్దంన్నర క్రితం ప్రతిపాదనలు చేశారు. సర్వేలు, భూసార పరీక్షలు మాత్రమే పూర్తి చేశారు. దీంతో పనుల్లో వేగం పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం అధికారులతో కమిటీని నియమించింది. పనుల పర్యవేక్షణతో పాటు నిర్వాహణ బాధ్యతలను అప్పగిస్తూ పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలకు చెందిన అధికారులతో కమిటీని నియమించింది. ఈ మేరకు రైల్వే మంత్రిత్వ శాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. రామగుండం-మణుగూరు రైల్వే లైన్ 207.80 కిలోమీటర్ల మేర ఉంటుంది. పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని మారుమూల ప్రాంతాల గుండా ఈ రైలు మార్గం వెళ్తుంది. సింగరేణి గనులు విస్తరించి ఉన్న ఈ ప్రాంతాల్లో విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాలు కూడా ఉండటంతో రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని భావించిన రైల్వే శాఖ పట్టాల నిర్మాణాన్ని ప్రతిపాదనలకు ఎక్కించింది.

ముగ్గురు అధికారులతో కమిటీ: రెండు జిల్లాల పరిధిలోని ముగ్గురు అధికారులతో కమిటీని నియమించింది. పెద్దపల్లి జిల్లాకు చెందిన అదనపు కలెక్టర్‌తో పాటు భూపాలపల్లి జిల్లా సబ్ కలెక్టర్, ఆర్డీవోలు కమిటీలో ఉన్నారు. పెద్దపల్లి జిల్లాలోని ముత్తారం, మంథని, రామగిరి, కమాన్‌పూర్ మండలాల్లో జరిగే పనులను జిల్లా అదనపు కలెక్టర్ పర్యవేక్షిస్తారు. మల్హర్‌రావు, కాపురం, మణుగూరు ప్రాంతాలకు భూపాలపల్లి సబ్‌కలెక్టర్, ఘన్‌పూర్, భూపాలపల్లి మండలాలకు భూపాలపల్లి ఆర్డీవోలకు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు.

పనుల్లో వేగానికి..: రామగుండం-మణుగూరు రైల్వే పనుల సర్వేలు ఏడాది కిందటే పూర్తి కాగా.. నాలుగు జిల్లాల కలెక్టర్లకు నివేదికలు అప్పగించారు. రైలు మార్గానికి ఎంత భూమి సేకరించాలి.. పరిహారం అంశాలపై అధికారులు కమిటీ యజమానులతో మాట్లాడి చర్యలు చేపట్టనున్నారు. ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన జాతర జరిగే మేడారం ప్రాంతం మీదుగా ఈ రైలు మార్గం వెళ్తుంది. దీంతో మారుమూల అటవీ ప్రాంతాల ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడుతోంది. సాధ్యమైనంత తొందరగా భూసేకరణ పనులు పూర్తి చేసేందుకు ఈ కమిటీని నియమించింది. భూసేకరణ ముగిసిన వెంటనే నిర్మాణం పనులు వేగంగా చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది.




రైలు మార్గం రేఖా చిత్రం

రామప్ప.. సకల కళల సమ్మేళనం..!

వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్ శిక్షణలో కొత్త ఆలోచనలకు స్వాగతం

యునెస్కో గుర్తింపు పొందిన కట్టడాల ప్రాముఖ్యాన్ని ప్రపంచస్థాయిలో మరింత ప్రచారం చేయడానికి యునెస్కో.. ఏటా వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్ శిక్షణ శిబిరాలను నిర్వహిస్తోంది. ఈనెల 15 నుంచి 26 వరకు 12 రోజుల పాటు రామప్పలో జరుగుతోంది. ఈ కార్యక్రమ నిర్వహణకు మే నెలలోనే దరఖాస్తులు స్వీకరించింది. 243 మంది దరఖాస్తులు చేసుకోగా.. 40 మందిని ఎంపిక చేసింది. వీరితో పాటు యువ టూరిజం పేరుతో ఈ శిబిరానికి మరో 40 మందికి ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి అవకాశం కల్పించింది. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వాలంటీర్లతో మాట్లాడి 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం..

–వెంకటాపూర్, న్యూస్‌టుడే



మనకు గర్వకారణం..

రామప్ప ఆలయం.. 800 ఏళ్ల చరిత్ర. ఎన్నో ప్రకృతి విపత్తులను ఎదుర్కొని యునెస్కో గుర్తింపు పొంది ఓరుగల్లుకు గర్వకారణంగా నిలిచింది. ములుగు జిల్లా వెంకటాపూర్ మండల పరిధిలోని ఈ రాతి కట్టడం నిర్మాణశైలి నేటి తరానికి ఎన్నో ఆలోచనలను రేకెత్తిస్తోంది. అయోధ్య రామమందిర పునాదిలో రామప్ప సాండ్‌బాక్స్ టెక్నాలజీ వాడారంటే ఆనాటి సాంకేతిక పరిజ్ఞానం ఎంత గొప్పదో తెలుస్తోంది..

కేరళ, తమిళనాడు, మహారాష్ట్ర, గుజరాత్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన టూరిజం, చరిత్ర, ఆర్కియాలజీ, ఆర్కిటెక్చర్, కళలు, సివిల్ ఇంజినీరు విభాగాల్లో నైపుణ్యం కలిగిన విద్యార్థులు వాలంటీర్లుగా శిక్షణ పొందుతున్నారు.



శిక్షణ బృందం

కేరళ..

సామాజిక మాధ్యమాల్లో తెలుసుకుని..



కేరళ యూనివర్సిటీ ఆర్కియాలజీ విభాగంలో పీహెచ్‌డీ చేస్తున్న సంజయ్ మూడేళ్ల నుంచి కాలభైరవునిపై పరిశోధన చేస్తున్నారు. భారత దేశంలో ఉన్న ఆలయాలను స్వయంగా వెళ్లి చూడటం.. వాటి ప్రత్యేకతలు తెలుసుకోవడం ఆయనకు అభిలాష. సంజయ్ సందర్శించిన ఆలయాలు చాలావరకు శిథిలావస్థకు చేరుకున్నవి కూడా ఉన్నాయి. వందల ఏళ్లుగా చెక్కుచెదరకుండా ఉండి, ఆనాడే అద్భుత సాంకేతికతను వాడడం, తెలుగు రాష్ట్రాల నుంచి యునెస్కో గుర్తింపు పొందిన ఏకైక కట్టడం రామప్ప అని సామాజిక మాధ్యమాల్లో తెలుసుకున్నారు. వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్ శిక్షణకు దరఖాస్తు చేసుకుని ఎంపికయ్యారు.

● రామప్పకు చేరుకోగానే శిలాశాసనం, చరిత్ర గురించి ఆరా తీశారు. ఆయన పరిశీలించిన ఆలయాల్లో రామప్పకు గొప్ప ప్రత్యేకత ఉందని, వాడిన సాంకేతిక పరిజ్ఞానం మరెన్నో కట్టడాల పునర్నిర్మాణానికి ఉపయోగకరంగా ఉందని ఇతరులకు తెలియజేయడానికి నిత్యం సామాజిక మాధ్యమాల ద్వారా చర్చిస్తున్నారు.

తమిళనాడు

సదస్సులకు వెళ్తూ.. స్వయంగా పరిశీలిస్తూ



టీఎన్ఎస్‌డీప పీజీ డిప్లొమాలో ఇంజినీరింగ్ చేస్తున్న విజయరాజ్‌ది తమిళనాడు. దేశవ్యాప్తంగా వారసత్వ కట్టడాలకు సంబంధించిన సదస్సులకు హాజరవ్వడం మక్కువ. ఫేస్‌బుక్‌లో చూసిన పోస్టును ఆధారం చేస్తుకుని వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్ శిక్షణ శిబిరం-3కి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. కాకతీయ హెరిటేజ్ ట్రస్టు సభ్యుడు ప్రొఫెసర్ పాండురంగారావు సూచనల మేరకు తమిళనాడు నుంచి తన నలుగురు మిత్రులతో కలిసి రామప్పకు వచ్చారు.

● కాకతీయులు నిర్మించిన ఆలయాల ప్రత్యేకత గురించి శిబిరంలో నేర్చుకుంటున్నారు. ప్రొఫెసర్లు వివరించే తీరు, ప్రత్యక్షంగా చూపించే పద్ధతి ఎంతో ఉపయోగకరంగా ఉందంటూ చెప్పారు. శిక్షణలో కొత్త ఆలోచనలు పంచుకుంటున్నారు.

ఆంధ్రప్రదేశ్

ప్రకృతి ప్రతిరూపమే.. పర్యాటకం



ప్రకృతి రూపమైన పర్యాటకాన్ని ప్రపంచ నలుమూలలా చాటేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నంద్యాలకు చెందిన జ్ఞానకళ బీబీఏ టూరిజం విభాగంలో పరిశోధనలు చేస్తున్నారు. లెజర్ టూరిజం, అడ్వంచర్, ఫుడ్స్, గుళ్లగోపురాలకు సంబంధించిన పర్యాటక మెలకువలను నేర్చుకోవడానికి ప్రయత్నాలు మొదలు పెట్టారు.

● పర్యాటక ప్రదేశాలకు వెళ్లిరావడం కాదని, అక్కడ చూసిన, తెలుసుకున్న విషయాలపై అవగాహన పెంచుకొని పలువురికి తెలియజేయాలని వాట్సాప్, ఫేస్‌బుక్ వేదికలుగా వేలాది మందికి అవగాహన కల్పిస్తున్నారు. శిబిరంలో ఏర్పాటు చేసిన బృందాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. రామప్ప అద్భుత శిల్పాల గురించి ప్రపంచవ్యాప్తంగా తెలియజేయడంలో తన వంతు పాత్ర పోషిస్తున్నారు..

తెలంగాణ

టూరిజం క్లబ్‌లో స్థానం దక్కించుకుని..



చరిత్రను అభ్యసించేవారు తగ్గిపోతున్న ఈ రోజుల్లో వరంగల్ పింగిళి కళాశాల హిస్టరీ ప్రొఫెసర్ శ్రీనివాస్ ప్రోత్సాహంతో స్వప్న బీఏ(చరిత్ర) చదువుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన టూరిజం క్లబ్(యువటూరిజం)లో స్థానం దక్కించుకుని వాలంటీర్ శిక్షణకు ఎంపికయ్యారు.

● కాకతీయ కట్టడాల చరిత్ర అంటే అంతా ఒకేలా ఉంటుందని అనుకున్న ఆమె రామప్పకు చేరుకున్న తర్వాత ఆలయంలోని రాగిని, నాగిని శిల్పాలు, పొన్న చెట్టుపై ఉన్న శ్రీకృష్ణుడు సత్యభామ చీర లాగడం, శిల్పాలను మీటితే సరిగమపదనిసలు రావడం, క్షీరసాగరమథనం, శివపార్వతుల కళ్యాణం, నరకాసురవధ లాంటి పురాణ హితిహాసగాథలు, భూకంపాలను తట్టుకునే విధంగా కట్టిన ఆలయ నిర్మాణాన్ని చూసి అబ్బురపడిపోయారు. దేశంలోని చరిత్రలకే కాకతీయుల చరిత్ర పునాదిగా నిలిచిందంటున్నారు.



హనుమకొండ జిల్లాలోని ఓ క్వారీలో తవ్వకాలు

ఇక్కడా ఉన్నారు ఘనులు

● కరుగుతున్న గుట్టలు.. తరలుతున్న మొరం

గనుల మేతలో ఆరితేరిన లీజుదారులకు అధికారులు వత్తాసు పలుకుతున్నారు. ఉమ్మడి వరంగల్‌వ్యాప్తంగా నిబంధనలకు విరుద్ధంగా ఇష్టారీతిన తవ్వకాలు జరుగుతున్నాయి. జనగామ జిల్లా మైనింగ్ శాఖ ఏడీ విజయ్‌కుమార్ ఇటీవల సస్పెండ్ అయ్యారు.. ఆయన మహబూబ్‌నగర్ జిల్లాలో పనిచేసినప్పుడు స్థిరాస్తి వ్యాపారులకు సహకరించి అవినీతికి పాల్పడ్డారనే ఆరోపణలపై విచారణ జరిపి ప్రభుత్వం ఆమేరకు నిర్ణయం తీసుకుంది.. ఉమ్మడి జిల్లాలోనూ గ్రానైట్, మట్టి తవ్వకాల్లో రూ.కోట్లల్లో అక్రమాలు జరిగింది. ఇక్కడ సైతం పూర్తిస్థాయిలో విచారణ చేపడితే అవినీతి అధికారులపై వేటు పడే అవకాశం ఉంది.

–ఐనవోలు (హనుమకొండ), న్యూస్‌టుడే

టాస్క్‌ఫోర్స్

'ఉమ్మడి వరంగల్ వ్యాప్తంగా గనుల తవ్వకాల కోసం అనుమతులు పొందినవి 1,276 కాగా, అక్రమంగా తవ్వకాలు చేపట్టేవి 430కి పైగా ఉన్నట్లు గుర్తించారు.'

'వరంగల్ గ్రానైట్‌ను దేశంలో అనేక రాష్ట్రాలకు ఎగుమతి చేస్తారు. క్వారీల నుంచి బ్లాక్, టాన్ బ్రౌన్, టాన్ రెడ్, టాన్ బ్లూ గ్రానైట్ అధికంగా లభిస్తుంది.'

ప్రభుత్వ ఆదేశాలతో విచారణ జరిపిన అధికారులు గనుల తవ్వకాల్లో భారీగా సీనరేజి ఎగవేత జరిగిందని గుర్తించారు. జనవరి, ఫిబ్రవరి నెలల్లో లీజుదారులకు నోటీసులు జారీ చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో సైతం 80 మందికిపైగా లీజుదారులకు నోటీసులు అందజేసి జరిమానా విధించారు. దీంతో కొంతమంది క్వారీలు మూసివేశారు.

పంట పొలాలు.. వెంచర్లుగా: స్థిరాస్తి వ్యాపారం సజావుగా కొనసాగాలంటే అనుమతులతో పాటు భూమి చదునుగా ఉండటం ముఖ్యం. ఇందుకు ప్రధానంగా మొరం అత్యంత అవసరం. గ్రేటర్ వరంగల్ నగరం చుట్టూ ధర్మసాగర్, ఆత్మకూరు, ఐనవోలు, దామెర, హసన్‌పర్తి మండలాల్లో 109 గ్రానైట్, మొరం క్వారీలు ఉన్నాయి. ఇందులోని మొరాన్ని స్థిరాస్తి వ్యాపారానికి వినియోగిస్తున్నారు. అధికారులు ఇచ్చే అరకొర అనుమతులతో గ్రానైట్, మట్టి, ఇసుక తవ్వకాల్లో అనుమతులకు భిన్నంగా లీజుదారులు తోడేస్తున్నారు. నగరానికి వేలాది టిప్పర్ల ద్వారా మట్టిని తరలిస్తున్నారు. అధికారులు, లీజుదారులు, వ్యాపారులు కుమ్మక్కై చేతివాటం చూపడంతో వేలాది వ్యవసాయ భూములు వెంచర్లుగా వెలుస్తున్నాయి.

ఇదీ పరిస్థితి..

● కాజీపేట నుంచి వరంగల్ వెళ్లే బైపాస్ ప్రధాన మార్గం భట్టుపల్లి రెవెన్యూ పరిధిలో రహదారికి ఆనుకొని ఉన్న 18 ఎకరాల భూమి రోడ్డుకు 10 ఫీట్ల లోతులో ఉండేది. ఆ భూమికి ఎదురుగా ఓ కార్పొరేట్ పాఠశాల, కళాశాల ఏర్పాటు చేయగా ఆ ప్రాంత భూముల ధరలకు రెక్కలొచ్చాయి. లోతట్టులో ఉన్న భూమిని రహదారికి సమాంతరంగా చేయాలని ఆ భూమి యజమాని భావించారు. గత పాలకులు, అధికారుల సహకారంతో కొండపర్తి, వనమాలకనపర్తి, తరాలపల్లి క్వారీల నుంచి 4 వేలకుపైగా టిప్పర్ల ద్వారా 80 వేల మెట్రిక్ టన్నుల మొరం తరలించి రోడ్డుకు సమాంతరంగా భూమిని చదును చేశారు.

● హైదరాబాద్ -వరంగల్ జాతీయ ప్రధాన రహదారిలో రాంపూర్ రెవెన్యూ పరిధిలో అనుమతులు తీసుకుని 30 ఎకరాల్లో ఏర్పాటు చేసి ఓ లేఅవుట్, వరంగల్-ఖమ్మం జాతీయ ప్రధాన రహదారిలో పున్నేలు రెవెన్యూ పరిధిలో 25 ఎకరాల్లో ఏర్పాటు చేసిన వెంచర్, దేవన్నపేట, మడిపల్లి రెవెన్యూ పరిధిలో 40 ఎకరాల్లో ఏర్పాటు చేసిన లేఅవుట్ల భూముల్లోకి వేలాది టిప్పర్ల ద్వారా మొరం తరలించారు. మొత్తంగా రూ.8 కోట్లకు పైగా మొరం తరలింపులో అధికారుల పాత్ర ఉందని ఆరోపణలు ఉన్నాయి.

ధర్మసాగర్ మీదుగానే గూడ్స్ లైన్ బైపాస్

● నష్కల్ నుంచి చింతలపల్లికి మరోటి

కాజీపేట, న్యూస్‌టుడే: హసన్‌పర్తి రోడ్డు నుంచి ధర్మసాగర్ మీదుగా నష్కల్ వరకు గూడ్సు బైపాస్ లైను నిర్మాణానికి రైల్వే శాఖ అడుగులు వేస్తోంది. తాజాగా ఈ మార్గంలో 24.55 కి.మీటర్ల మేర భూసేకరణకు నోటిఫికేషన్ జారీ చేసింది. ఇప్పటికే ధర్మసాగర్ రైతులు బైపాస్ లైను మార్గం మార్చాలని కోరుతున్నారు. ముందుగా పెండ్యాల నుంచి 163వ జాతీయ రహదారి పక్కనుంచి లైన్‌ను ప్రతిపాదించారు. తర్వాత బైపాస్ మార్గాన్ని మార్చుతూ రైల్వే నిర్ణయం తీసుకుంది. కొందరు పెద్దల ఒత్తిడే దీనికి కారణమంటూ ధర్మసాగర్ రైతులు ఆరోపిస్తున్నా.. రైల్వే శాఖ ధర్మసాగర్ మీదుగానే బైపాస్ నిర్మాణానికి సిద్ధమైంది. భూసేకరణ కోసం జనగామ, హనుమకొండ జిల్లాల్లోని ధర్మసాగర్, హసన్‌పర్తి, చిల్పూర్ రెవెన్యూ అధికారులకు నోటిఫికేషన్ అందించింది. దీంతో పాటు నష్కల్ నుంచి మామునూరు మీదుగా గీసుకొండ మండలం చింతల్ రైల్వే స్టేషన్ వరకు మరో బైపాస్‌ను ప్రతిపాదించింది. గూడ్సురైళ్లను బైపాస్‌ల మీదుగా పంపించి కాజీపేట, వరంగల్ స్టేషన్లలో ప్రయాణికుల రైళ్ల రాకపోకలకు సుగమం చేయడానికి ఈ రెండు మార్గాలను ప్రతిపాదించింది. బల్లార్షా- కాజీపేట మార్గంలో గూడ్సు రైళ్ల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతుండటం వల్ల ఈ మార్గంలో ముందస్తుగా నిర్మాణం చేయాలని భావిస్తోంది.

వంతెన నిర్మాణానికి ప్రణాళిక.. : హసన్‌పర్తి రోడ్డు - నష్కల్ స్టేషన్ల మధ్య నిర్మించే బైపాస్ లైన్ నష్కల్ లేదా పెండ్యాల వద్ద 163వ జాతీయ రహదారిని క్రాస్ చేయాల్సి ఉంటుంది. అలాగే బైపాస్ వల్ల ఎక్కువగా ధర్మసాగర్ గ్రామస్థులు, రైతులకు ఇబ్బంది కలిగే అవకాశం ఉంది. అందుకని ఈ రెండు చోట్ల వంతెనల నిర్మాణం కోసం రైల్వే అధికారులు ప్రణాళిక రూపొందిస్తున్నారు.



రైల్వే శాఖ విడుదల చేసిన రూట్‌మ్యాప్

చికెన్ ధరలు

(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్

ఫాం:	120
రిటైల్:	142
డ్రెస్డ్:	206
స్కిన్‌లెస్:	234

అవివాహితులకు సువర్ణావకాశం

నేడు, రేపు అన్ని కులాల వధూవరులకు 'ఈనాడు' పెళ్లిపందిరి. నెట్ ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం



జనగామ, న్యూస్‌టుడే: తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన 'ఈనాడు' పెళ్లిపందిరి.నెట్ అన్ని కులాల అవివాహిత వధూవరులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహిస్తోంది. జనగామలోని శ్రీచెన్నకేశవ స్వామి దేవాలయం వేదికగా ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. వివాహం కోసం ఎదురు చూస్తున్న వధూవరులతో పాటు, సంబంధిత కుటుంబీకులు నేడు అనగా శనివారం(19 అక్టోబరు 2024) మరియు ఆదివారం (20 అక్టోబరు 2024) నాడు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్టర్ చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ చేయదలిచిన వధూవరుల బయోడేటా, ఫొటోలు దిగువన పేర్కొన్న వాట్సాప్ ఫోన్ నెంబర్లకు పంపవచ్చు. మరిన్ని వివరాలకు 8314445190, 8008002165 ఫోన్ నెంబర్లలో సంప్రదించవచ్చు.



సమస్యలు బోలెడు..

కొత్త వీసీపై ఆశలు

కాకతీయ విశ్వవిద్యాలయం ఉప కులపతిగా నియమితులైన విశ్రాంత ఆచార్యులు కర్నాటి ప్రతాప్‌రెడ్డికి ఇక్కడి సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. ఇటు విద్యార్థులు, అటు ఆచార్యులు, అధ్యాపకులు ఆయనపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారంపై ప్రధానంగా దృష్టి సారించాలని కోరుతున్నారు.

విద్యానగర్, కేయూ క్యాంపస్, న్యూస్‌టుడే

వేతనాలకే చాలని నిధులు..

ఉత్తర తెలంగాణలో విద్యా కేంద్రంగా విరాజిల్లుతున్న కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్థిక సంక్షోభంతో కొట్టుమిట్టాడుతోంది. ఇక్కడ పని చేస్తున్న వెయ్యి మంది బోధన, బోధనేతర సిబ్బంది వేతనాలకు ఏడాదికి రూ.150 కోట్లు అవసరం. రాష్ట్ర ప్రభుత్వం నుంచి బ్లాక్ గ్రాంట్ కింద వస్తున్న రూ.97 కోట్లు వేతనాలకు సరిపోక.. ఏటా రూ.53 కోట్ల నిధులు అంతర్గత సమీకరణల ద్వారా సమకూర్చుకుంటున్నారు. నిధులు లేక అభివృద్ధి అటకెక్కింది. తక్షణం నిధుల సేకరణపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

వేధిస్తున్న అధ్యాపకుల కొరత..

విశ్వవిద్యాలయంలో బోధన, పరిశోధనలను ప్రగతి పథంలో పరుగులు పెట్టించాలంటే అధ్యాపకుల పాత్ర ఎంతో కీలకం. వర్సిటీలో ప్రస్తుతం బోధన అంతా ఒప్పంద, తాత్కాలిక అధ్యాపకులతోనే సాగిస్తున్నారు. మొత్తం 405 రెగ్యులర్ అధ్యాపక పోస్టులు ఉండగా.. అందులో 83 మంది మాత్రమే పని చేస్తున్నారు. మరో 190 మంది ఒప్పంద, 201 మంది తాత్కాలిక అధ్యాపకులు బోధిస్తున్నారు. కొత్తగా ప్రవేశ పెట్టిన కోర్సులతో కలిపి సుమారు వెయ్యి మంది వరకు అధ్యాపకులు ఉండాలి. వారి నియామకాలే పెద్ద సమస్యగా మారింది.



నిధులు లేక నిరుపయోగంగా ఉన్న కె-హబ్

మరిన్ని..

- విశ్వవిద్యాలయంలో మొత్తం 14 వసతి గృహాలు ఉన్నాయి. వీటిలో బాలురకు సరిపడా ఉన్నా.. బాలికలకు వసతి కొరత ఉంది.
- కబ్జాకు గురైన కేయూ భూములను స్వాధీనం చేసుకోవడంపై దృష్టి పెట్టాలి. మిగతా స్థలాలు ఆక్రమణకు గురికాకుండా ప్రహరీ నిర్మాణం అవసరం.
- పీహెచ్‌డీ ప్రవేశాలపై కొనసాగుతున్న వివాదం

15వ ఉప కులపతిగా కర్నాటి ప్రతాప్‌రెడ్డి



విద్యానగర్, న్యూస్‌టుడే: కాకతీయ విశ్వవిద్యాలయం 15వ ఉప కులపతిగా కర్నాటి ప్రతాప్‌రెడ్డి రానున్నారు. ఆయనకు 32 సంవత్సరాలకు పైగా బోధన, 37 సంవత్సరాల పరిశోధన అనుభవం ఉంది. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో సైన్స్ డీన్‌గా పనిచేసి 2021లో ఉద్యోగ విరమణ పొందారు. కాకతీయ విశ్వవిద్యాలయానికి వ్యక్తిపరంగా 13వ, పదవీ కాలం పరంగా చూస్తే 15వ ఉప కులపతి అవుతున్నారు. గతంలో ఆచార్య జాఫర్ నిజాం, ఆచార్య టి.వాసుదేవ్ రెండుసార్లు వీసీగా పని చేశారు. ఆచార్య టి.రమేశ్ పదవీ కాలం ఈ ఏడాది మార్చి 21న ముగిశాక ఇప్పుడు రెగ్యులర్ వీసీ నియామకం అయ్యారు.

ఇదీ ప్రస్థానం

● కర్నాటి ప్రతాప్‌రెడ్డిది రంగారెడ్డి జిల్లా యాచారం. 1981లో బీఎస్సీ (హానర్స్) జంతుశాస్త్రంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ పట్టా పొందారు. అదే విశ్వవిద్యాలయం నుంచి 1983లో జంతుశాస్త్రం, న్యూరోబయాలజీ నుంచి పీజీ పట్టా తీసుకున్నారు. 1988లో జంతుశాస్త్రం, న్యూరోబయాలజీ లో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి నుంచి పీహెచ్‌డీ పట్టా పొందారు. ఉద్యోగ జీవితంలో ఎన్నో బాధ్యతలు నిర్వర్తించారు.. ముఖ్యంగా

● 2016 నుంచి 2018 వరకు జంతుశాస్త్ర విభాగాధిపతిగా, 2018 నుంచి 2020 వరకు విశ్వవిద్యాలయ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా, 2020 నుంచి ఉస్మానియా విశ్వవిద్యాలయంలో సైన్స్ డీన్‌గా సమర్థంగా పనిచేశారు. 2021లో ఉద్యోగ విరమణ చేశారు. తన ఉద్యోగ ప్రస్థానంలో 104 జాతీయ, అంతర్జాతీయ పరిశోధన పత్రాలు ప్రచురించారు. 87 జాతీయ, అంతర్జాతీయ పరిశోధన, ప్రదర్శనలు చేశారు. 10 ప్రాజెక్టులు పూర్తి చేశారు. 7 పుస్తకాలను రచించారు. 25 మందికి పరిశోధన పర్యవేక్షకుడిగా పని చేశారు.



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ప్రతిభ చాటారు.. విజేతలుగా నిలిచారు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న పాఠశాల ప్రిన్సిపల్, ఛైర్మన్ తదితరులు


భూపాలపల్లి, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రంలోని గాంధీనగర్ కాలనీ ప్రాంతంలో శ్రీ చైతన్య ఉన్నత పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో శుక్రవారం ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'ఇంటర్నెట్ వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశాలపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులు తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో ప్రతిభచాటిన విద్యార్థులు ఆర్.అభిరాం, డి.వెన్నెల, బి.రామకృష్ణకు ఆ పాఠశాల ప్రిన్సిపల్ అనిల్, ఛైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, డీజీఎం చేతన్, ఏజీఎం సద్వార్, కో ఆర్డినేటర్ శివకోటేశ్వర్, డీన్ స్వామి బహుమతులు అందజేశారు. పోటీల్లో పాల్గొన్న విజేతలకు ప్రశాంసాపత్రాలను అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తిరుపతి, భాస్కర్, గణపతి, సమ్మయ్య, లక్ష్మి పాల్గొన్నారు.

అనుమతులిస్తే.. ఆర్చిగేటు నిర్మాణం

న్యూస్‌టుడే, కాళేశ్వరం(భూపాలపల్లి జిల్లా) : కాళేశ్వరం దేవస్థానానికి సంబంధించి మహదేవపూర్ వద్ద ఆర్చిగేటు నిర్మాణానికి జాతీయ రహదారి అధికారులు అనుమతిస్తే... వెంటనే శంకుస్థాపనకు ముహూర్తం ఖరారుకు దేవస్థాన అధికారులు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. 2017లో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించిన బాహుబలి మోటార్ల తరలింపునకు అడ్డుగా ఉందన్న కారణంగా మహదేవపూర్ వద్ద పురాతన నాటి ఆర్చిగేటును తొలగించారు. నిర్మాణ సంస్థ మెగా ఇన్‌ఫ్రా ఆర్చిగేటును తొలగించినందుకు రూ.27 లక్షల నగదు చెల్లించింది. తాజాగా రూ.32 లక్షల వ్యయంతో నూతన ఆర్చిగేటు నిర్మాణానికి గతేడాది నుంచి కార్యాచరణ దాల్చినా జాతీయ రహదారి అధికారుల నుంచి అనుమతులు రావడం లేదని తెలిసింది. ఇటీవల ఆర్చిగేటు నిర్మాణానికి సంబంధించిన దేవస్థానం ఆధ్వర్యంలో టెండర్లను పిలిచి తతంగం పూర్తి చేశారు. సంబంధిత గుత్తేదారు నిర్మాణాలకు సిద్ధంగా ఉండగా జాతీయ రహదారి నిబంధనలు అడ్డు వస్తున్నాయి. దేవస్థాన అధికారులు జాతీయ రహదారి అధికారులకు లేఖ సమర్పించినా తాత్సారం జరుగుతోంది. అనుమతులు వస్తే మంత్రి శ్రీధర్‌బాబును కలిసి ముహూర్తం ఖరారు చేస్తామని దేవస్థాన అధికారులు చెబుతున్నారు. త్వరలో కార్తీకమాసం సమీపిస్తుండగా ఒక వైపు ఆర్చిగేటు నిర్మాణంతో పాటు కాళేశ్వర ఆదిముక్తీశ్వర దేవస్థానం వద్ద ధ్వజస్తంభం ఏర్పాటుకు ముహూర్తం ఖరారు చేసి మంత్రి చేతుల మీదుగా ప్రారంభోత్సవాలు నిర్వహించాల్సి ఉంది. ఈ విషయంపై ఈవో మారుతిని సంప్రదించగా జాతీయ రహదారి అధికారుల నుంచి అనుమతులు వచ్చిన వెంటనే మంత్రిని కలిసి చర్చిస్తామని చెప్పారు.



గతంలో తొలగించిన ఆర్చిగేటు(పాత చిత్రం)



కొత్త నమూనా

జాతీయ రహదారి నిర్మాణంలో తాత్సారమే..

కాళేశ్వరం : మహదేవపూర్ నుంచి కాళేశ్వరం వరకు అటవీ ప్రాంతం పరిధి 15 కిలోమీటర్లు, కాళేశ్వరం శివారు రెండున్నర కిలోమీటర్ల జాతీయ రహదారి నిర్మాణాలు మరింత జాప్యం కానున్నాయి. 15 కి.మీ మేర అటవీ ప్రాంతంలో సంబంధిత శాఖ అధికారులు ఇటీవల గుర్తులు వేసి చెల్లించాల్సిన రుసుం లెక్కించారు. నిర్మాణాల్లో 7800 వృక్షాలను అటవీ శాఖ కోల్పోతుండగా, రూ.2.67 కోట్లు ఎన్‌హెచ్ చెల్లించాల్సి ఉంది. ఇందుకు సంబంధించిన జిల్లా అటవీ శాఖ కేంద్ర అటవీ శాఖకు జాబితా పంపించింది. కేంద్ర అనుమతులు వచ్చేవరకు క్షేత్ర స్థాయిలో పనులు ప్రారంభించాల్సి ఉంటుంది. అటవీశాఖ అనుమతులు, చెల్లింపులు పరివేశ్ పోర్టల్ ఆన్‌లైన్ ద్వారా జరుగుతుందని అటవీశాఖాధికారులు చెబుతున్నారు. అటు రాష్ట్ర ప్రభుత్వం, ఇటు జాతీయ రహదారుల అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో కేంద్ర అటవీ శాఖ నుంచి అంత సులువుగా అనుమతులు లభించవని సంబంధిత శాఖ అధికారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మూడు నెలల క్రితం క్షేత్ర స్థాయిలో ప్రక్రియ పూర్తిచేసినా వచ్చే ఏడాది సంక్రాంతి అనంతరమే అనుమతులు వచ్చేలా ఉన్నట్లు తెలుస్తోంది. రెండేళ్ల కిత్రం స్వయంగా ప్రధాన మంత్రి ఈ జాతీయ రహదారి నిర్మాణాలకు రామగుండంలో వర్చువల్ ప్రారంభోత్సవాలు చేసినా ఒక్క అడుగు కూడా ముందుకు కదలడం లేదు. కోల్పోతున్న వృక్షాలతో పాటు చెల్లించాల్సిన రుసుం వివరాలను కేంద్ర అటవీశాఖకు పంపించినట్లు అటవీశాఖాధికారులు చెబుతున్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



సూరారంలో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి మధుసూదన్

మహదేవపూర్, న్యూస్‌టుడే : విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని.. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్యాధికారి మధుసూదన్ తెలిపారు. మండలంలోని అంబట్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, సూరారంలో వైద్య శిబిరాన్ని పరిశీలించారు. వైద్య సిబ్బంది హాజరు, రోగులకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. సీజనల్ వ్యాధులపై గ్రామాల్లో అవగాహన కల్పిస్తూ వైద్య శిబిరాల ద్వారా సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు మౌనిక, మహత్ అలీ పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణ విజయవంతం చేయండి



మల్హర్, న్యూస్‌టుడే : కొయ్యూర్‌లో శుక్రవారం ఆదివాసీ హక్కుల పోరాట యోధుడు కుమురం భీం విగ్రహావిష్కరణ కరపత్రాన్ని ఆవిష్కరించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ ఈ నెల 25న విగ్రహావిష్కరణకు భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కాటారం డివిజన్ నాయకులు ఎర్రయ్య, పోచయ్య, చిన్నసమ్మయ్య, గుంటి రమేష్, మల్లేశ్ పాల్గొన్నారు.

169 క్వార్టర్ల కేటాయింపు



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సింగరేణి అధికారులు, కార్మిక సంఘాల నాయకులు

భూపాలపల్లి, న్యూస్‌టుడే : భూపాలపల్లి ఏరియాలోని సుభాష్‌కాలనీ, కృష్ణాకాలనీ, 8 ఇంక్లైయిన్ కాలనీ, రామప్పకాలనీలో ఖాళీగా ఉన్న 169 క్వార్టర్లను సీనియారిటీ ప్రాతిపదికన శుక్రవారం కౌన్సెలింగ్ ద్వారా అధికారులు కేటాయించారు. క్వార్టర్ల కౌన్సెలింగ్ కోసం మొత్తం 623 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకోగా, 237 మంది మాత్రమే హాజరుకాగా, వీరు 135 క్వార్టర్లను ఎంపిక చేసుకున్నట్లు స్థానిక సింగరేణి జీఎం హబీబ్ హుస్సేన్ తెలిపారు. ఇంకా 34 క్వార్టర్లు ఖాళీగా ఉన్నాయి. వీటితో పాటు త్వరలోనే మరికొన్ని ఖాళీ క్వార్టర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. ఏరియాలో 90 శాతం మంది ఉద్యోగులకు నివాస సౌకర్యం కల్పించామని, కార్పొరేట్ స్థాయి అధికారుల ఆదేశాల మేరకే ప్రభుత్వ కార్యాలయాలు, ఉద్యోగులకు 2023లోపే నివాస గృహాలు కేటాయించడం జరిగిందని పేర్కొన్నారు. క్వార్టర్లు లేనివారికి ఇంటి అద్దె చెల్లించడం జరుగుతుందని, పూర్తిగా పారదర్శకంగా కౌన్సెలింగ్ నిర్వహించినట్లు తెలిపారు. అధికారులు కవీంద్ర, రవికుమార్, కావూరి మారుతి, రాజు, క్రాంతికుమార్, మరళీమోహన్ పాల్గొన్నారు.

విద్యుత్తు తీగలకు తాకి రైతు మృతి



గట్టయ్య

మల్హార్, న్యూస్‌టుడే : పంటను రక్షించేందుకు ఏర్పాటు చేసిన విద్యుత్తు తీగలకు తాకి రైతు మృతి చెందిన సంఘటన మల్హర్ మండలం మల్లారంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం ప్రకారం.. గట్టయ్య(50) వన్యప్రాణుల నుంచి పంటను కాపాడుకునేందుకు పొలం చుట్టూ విద్యుత్తు కంచె ఏర్పాటు చేశారు. శుక్రవారం ఉదయం పొలం వద్దకు వెళ్లిన గట్టయ్య ప్రమాదవశాత్తు తీగలకు తాకి విద్యుత్తు షాక్‌కు గురయ్యాడు. దీంతో అక్కడికక్కడే మృతిచెందారు. మృతుడు భార్య ఓదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు.

చికిత్సపొందుతూ యువకుడి..



మణిప్రసాద్(పాత చిత్రం)

గణపురం, న్యూస్‌టుడే : భూపాలపల్లి మండలం పెద్దాపూర్, గణపురం మండలం జంగుపల్లి గ్రామాల మధ్య బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడగా ఒకరు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన తెలిసిందే. ప్రమాదంలో తీవ్ర గాయాలైన జంగుపల్లి గ్రామానికి చెందిన వేముల మణిప్రసాద్(20) అనే యువకుడు చికిత్స పొందుతూ గురువారం అర్ధరాత్రి మృతి చెందాడు. మణిప్రసాద్‌తో పాటు జస్వంత్‌ను వరంగల్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. మణిప్రసాద్ ఆరోగ్యం విషమంగా ఉండటంతో ఎంజీఎంకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. గాయపడిన మరోవ్యక్తి పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్లు తెలిసింది.

మరో ఘటనలో మహిళ..

రేగొండ : దమ్మన్నపేట గ్రామానికి చెందిన పి.లక్ష్మి(54) పురుగు మందు తాగి చికిత్స పొందుతూ గత గురువారం రాత్రి మృతిచెందారు. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన లక్ష్మి కొంతకాలంగా కడుపు నొప్పితో బాధపడుతోంది. గురువారం ఉదయం తీవ్రమైన నొప్పి రావడంతో భరించలేక పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై ఎస్.సందీప్‌కుమార్ తెలిపారు. మృతురాలికి భర్త ఎల్లయ్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

మహదేవపూర్, న్యూస్‌టుడే : మహదేవపూర్ మండలం ఎలికేశ్వరం గ్రామానికి చెందిన ఓ బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె.పవన్‌కుమార్ తెలిపారు. గురువారం నుంచి బాలిక కనిపించకపోవడంతో బాలిక తండ్రి శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోండి



కాటారంలో అవగాహన కల్పిస్తూ..

కాటారం, న్యూస్‌టుడే : కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు అర్హులైన ఉపాధ్యాయులు ఓటరుగా నమోదు చేసుకోవాలని పీఆర్‌టీయూ మండల ప్రధాన కార్యదర్శి అనపర్తి తిరుపతి కోరారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఓటరు నమోదుపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. 2018 నుంచి 2024 వరకు మూడేళ్ల పాటు ఉన్నత పాఠశాలలో సర్వీసు పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులు అర్హులని పేర్కొన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ కార్యదర్శి గీత, రమేష్, హెచ్‌ఎం ఉమారాణి పాల్గొన్నారు.

జాతీయ రహదారి మరమ్మతు చేయండి

కాటారం: జిల్లాలోని 353సీ జాతీయ రహదారిపై ఇసుక లారీల ఓవర్‌లోడ్‌తో ఏర్పడిన గుంతలతో ప్రమాదాలు జరుగుతున్నాయని.. నివారణ చర్యలు తీసుకోవాలని హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో నిర్వహిస్తున్న ప్రజా దర్బార్‌లో మండల కేంద్రానికి చెందిన రామిళ్ల రాజబాబు శుక్రవారం ఫిర్యాదు చేశారు. దెబ్బతిన్న జాతీయ రహదారితో నిత్యం ఏదో ఒక చోట ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నారని పేర్కొన్నారు. జాతీయ రహదారిని త్వరితగతిన పూర్తిస్థాయిలో మరమ్మతు చేసిన తర్వాతనే టోల్‌ప్లాజా సుంకం వసూలు చేసేలా జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖకు ఆదేశాలివ్వాలని కోరారు.

గాలికుంటు వ్యాధికి టీకా తప్పనిసరి



గణపురం, న్యూస్‌టుడే : పశువులను పెంచుకుంటున్న ప్రతి రైతు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలను వేయించాలని గణపురం మండల ప్రత్యేక అధికారి, జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి కుమారస్వామి అన్నారు. శుక్రవారం మండలంలోని పశువైద్యశాలను సందర్శించి టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయించాలన్నారు. నెల పాటు అన్ని గ్రామాల్లో ఉచితంగా టీకాలు వేస్తారని.. రైతులు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో భాస్కర్, ఏడీ గోపాల కృష్ణమూర్తి, వైద్యాధికారి శ్రీకాంత్, పంచాయతీ కార్యదర్శి విజేందర్ పాల్గొన్నారు.

● **ఉపాధి హామీ పథకంపై సమీక్ష :** గణపురం మండల ప్రత్యేకాధికారి, జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి కుమారస్వామి గణపురం మండల కేంద్రంలో ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించేలా రోజ్‌గార్ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించేందుకు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. పశువులకు తాగునీటి కోసం నీటి తొట్టెల ఏర్పాటు, షెడ్ల నిర్మాణాలను రైతులు ఉపయోగించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో భాస్కర్, పంచాయతీ కార్యదర్శి విజేందర్, ఇన్‌ఛార్జి ఏపీవో రాజు, టీఏ శ్రావణ్‌కుమార్, క్షేత్ర సహాయకురాలు శ్రీదేవి పాల్గొన్నారు.

న్యాయం చేయాలని రైతుల ధర్నా



చిట్యాల, న్యూస్‌టుడే : మండల కేంద్రంలోని కాకతీయ కాటన్ మిల్లు పాత యజమాని పత్తి కొనుగోలు చేసి ఏళ్లు గడుస్తున్నా డబ్బులు ఇవ్వలేదని, వెంటనే వాటిని ఇప్పించి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు శుక్రవారం మిల్లు ముందు ధర్నా చేశారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని కాకతీయ కాటన్ ఇండస్ట్రీస్ పాత యజమాని తోట ప్రసాద్ మండల కేంద్రం, చుట్టుపక్క గ్రామాలకు చెందిన రైతుల వద్ద ఐదేళ్ల క్రితం పత్తి కొనుగోలు చేశారు. రోజులు గడుస్తున్నా డబ్బులు ఇవ్వకపోవడంతో అతడిపై రైతులు ఒత్తిడి తీసుకొచ్చారు. దీంతో ఆయన ప్రామీసరీ నోట్‌లు రాసి ఇచ్చారు. ఈ క్రమంలో మండల కేంద్రంలోని ఓ బ్యాంకులో తీసుకున్న రుణాలు సరిగా చెల్లించకపోవడంతో మిల్లును స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత బ్యాంకు వారు వేలం నిర్వహించి విక్రయించారు. మిల్లు కొనుగోలు చేసిన వ్యక్తి ప్రారంభానికి ఏర్పాటు చేసుకుంటుండటంతో రైతులు ఆందోళన బాట పట్టారు. సుమారు 100 మందికి రూ.6 కోట్ల వరకు రావాల్సి ఉందని బాధిత రైతులు నిరసనకు దిగారు. తమకు న్యాయం జరిగే వరకు మిల్లును పునఃప్రారంభం చేయకూడదని కోరారు. ధర్నా విషయం తెలుసుకున్న ఎస్సై శ్రావణ్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. రైతులతో మాట్లాడి న్యాయం జరిగేలా కృషి చేస్తానని హామీ ఇవ్వంతో ధర్నా విరమించారు. కార్యక్రమంలో బాధిత రైతులు పబ్బ రవి, ఆకుల రవీందర్, గోపగాని సదానందం, రాయకొంరు, నర్సింహారెడ్డి, సాదుల రాజు, అల్లం లక్ష్మీ, చిలుకల రాజయ్య, ర్యాకం భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఆర్టిజన్ల వినతి



ఎమ్మెల్యే జీఎస్సార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఐకాస నాయకులు

భూపాలపల్లి, న్యూస్‌టుడే : విద్యుత్తు సంస్థలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరిస్తూ, రెగ్యులర్ పోస్టుల్లోకి కన్వర్షన్ ఇవ్వాలని తెలంగాణ విద్యుత్తు ఆర్టిజన్స్ కన్వర్షన్ జేఏసీ జిల్లా ఛైర్మన్ తిప్పారపు రాజు, కన్వీనర్ మోత్కూరి కోటి కోరారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే జీఎస్సార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యుత్తు సంస్థలో 18 ఏళ్లుగా విధులు నిర్వర్తిస్తున్న కాంట్రాక్టు కార్మికులను గత ప్రభుత్వం పర్మినెంటు చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. ఈ క్రమంలోనే మాజీ సీఎం కేసీఆర్ పర్మినెంటు చేస్తామని పేర్కొంటూ, విద్యుత్తు సంస్థలో తమను విలీనం చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీచేయగా, కొందరు నిరుద్యోగులు కోర్టును ఆశ్రయించిటన్లు తెలిపారు. అదే విధంగా ఆర్టిజన్స్ కార్మికులు కూడా హైకోర్టును ఆశ్రయిస్తే, తమకు అనుకూలంగా తీర్పు ఇచ్చినప్పటికీ ప్రభుత్వం పూర్తి స్థాయిలో పర్మినెంటు చేయకుండా మొదటి ఆర్డర్‌ను రద్దు చేసి, కొత్తగా ఫ్యాక్టరీ చట్టం 1946 స్టాండింగ్ ఆర్డర్ సర్వీస్ రూల్స్ తెరపైకి తెచ్చిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. నాయకులు యాల్ల సురేందర్‌రెడ్డి ఎండీ అంకుషావలి, కోసరి భాస్కర్, రాజేందర్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తే ప్రజల మన్ననలు

భూపాలపల్లి : నియోజకవర్గంలో పలు మండలాల్లో కొత్తగా పంచాయతీ రాజ్ శాఖలో ఏఈలుగా చేరిన ఉద్యోగులు క్రమశిక్షణ, అంకితభావంతో పని చేస్తూ.. ప్రజల మన్ననలు పొందాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు కోరారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యేను ఏఈలు శాలువాలతో ఘనంగా సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధులతో అభివృద్ధి పనులు నాణ్యతగా.. సకాలంలో పూర్తి చేయడానికి కృషి చేయాలని సూచించారు. నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన 52 మంది సీఎంఆర్‌ఎఫ్ లబ్ధిదారులకు రూ.36 లక్షల విలువైన నగదు చెక్కులను పంపిణీ చేశారు. పేదలను ఆర్థికంగా ఆదుకోవడానికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడం జరుగుతుందని ఈ సందర్భంగా గండ్ర సత్యనారాయణరావు తెలిపారు.

ఎమ్మెల్యేతో భేటీ

గణపురం : గణపురం గీత పారిశ్రామిక సహకార సంఘం నూతన కమిటీ శుక్రవారం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావును క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలవగా కమిటీని ఎమ్మెల్యే సన్మానించారు. గణపురంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి రూ. 20 లక్షలు మంజూరు చేసినందుకు వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు మాదాసు రవి, ఉపాధ్యక్షుడు మండల రవికుమార్, సభ్యులు రమేశ్, సదయ్య, రాజయ్య పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

కేటీపీపీ సీఈతో భేటీ

చెల్పూర్, న్యూస్‌టుడే : కాకతీయ థర్మల్ పవర్ ప్లాంట్(కేటీపీపీ) సీఈగా నూతన బాధ్యతలు స్వీకరించిన శ్రీప్రకాశ్‌ను శుక్రవారం మాదిగ విద్యుత్తు ఉద్యోగులు శాలువాతో సన్మానించారు. పలు సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నందిపాటి భాస్కర్, దండోర శ్రీను, చిలువేరు మల్లయ్య, ఇనుగాల కుమార్, మోరె రవి, సదానందం, రాజేందర్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

మహదేవపూర్, న్యూస్‌టుడే : మహదేవపూర్, కాళేశ్వరం సబ్ స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 9 గంటల నుంచి 10 వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీకాంత్ తెలిపారు. విద్యుత్తు ఉపకేంద్రం మరమ్మతుల కారణంగా అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు గమనించాలని పేర్కొన్నారు.

గణపురం, న్యూస్‌టుడే : నేడు(శనివారం) విద్యుత్తు మరమ్మతుల కారణంగా 33/11 కేవీ చెల్పూర్, 33/11 కొండాపూర్ విద్యుత్తు సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ వెంకటరమణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎల్‌ఆర్‌ఎస్ సర్వే పరిశీలన



కాటారం, న్యూస్‌టుడే : మండలకేంద్రంలో లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణ సర్వేను డివిజనల్ పంచాయతీ అధికారి వీరభద్రయ్య శుక్రవారం పర్యవేక్షించారు. సర్వే చేపడుతున్న తీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. పకడ్బందీగా ఎల్‌ఆర్‌ఎస్ సర్వే చేపట్టాలని, ఎలాంటి లోటుపాట్లకు తావు ఉండొద్దని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీవో వీరస్వామి, ఇరిగేషన్ ఏఈ రాజేశ్, కార్యదర్శులు షగీర్‌ఖాన్, నాగరాజు, రాజశేఖర్, సురేష్, నవ్యశ్రీ పాల్గొన్నారు.

శిక్షణ తరగతులు.. బృంద చర్చలు



చర్చల్లో పాల్గొన్న వాలంటీర్లు

వెంకటాపూర్, న్యూస్‌టుడే: కాకతీయ కళాక్షేత్రమైన రామప్పలో వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్ శిక్షణ శిబిరం కొనసాగుతోంది. యునెస్కో సూచనల మేరకు ఐకోమాస్, ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా, రాష్ట్ర పర్యాటక శాఖ, కాకతీయ హెరిటేజ్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మూడో వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్ శిక్షణ శిబిరంలో నాలుగో రోజైన శుక్రవారం ఉదయం యోగాసనాలతో ప్రారంభమైంది. నాగార్జున యూనివర్సిటీ టూరిజం ప్రొఫెసర్ గోవిందరాజు వారసత్వ కట్టడాలు, రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాల ప్రాముఖ్యత, వాటితో ముడిపడిన భవిష్యత్తుపై వివరించారు. పూర్వ భారతీయ చారిత్రక పరిశోధన మండలి అధ్యక్షుడు, ప్రొఫెసర్ వై.సుదర్శన్‌రావు కాకతీయ హెరిటేజ్ గురించి, వాలంటీర్ల బాధ్యతపై తరగతులు నిర్వహించారు. రెండు రకాల తరగతుల అనంతరం అసిస్టెంట్ టూరిజం ప్రమోషన్ అధికారి కుసుమ సూర్యకిరణ్ వాలంటీర్లతో సామూహిక చర్చలు(గ్రూప్ డిస్కస్) నిర్వహించి వారు నేర్చుకున్న అంశాలపై చర్చించారు. ఆయా కార్యక్రమాల్లో కాకతీయ హెరిటేజ్ ప్రతినిధి ప్రొఫెసర్ పాండురంగారావు, శిక్షణ శిబిరం ఇన్‌ఛార్జి శ్రీధర్‌రావు, పురావస్తు, టూరిజం శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామీణ రహదారులకు మహర్దశ

కాటారం, న్యూస్‌టుడే : మండలంలో పలు గ్రామాలను అనుసంధానిస్తూ నూతన రహదారులకు నిధులు మంజూరయ్యాయి. కాటారం మండలంలోని ఒడిపిలవంచ-గూడూరు వరకు రూ.3 కోట్లు, గుండ్రాత్‌పల్లి నుంచి ఉట్లపల్లి పోచమ్మ వరకు రూ.2 కోట్లు, దామెరకుంట నుంచి మానేరు(ఆరెంద) వరకు రూ.2 కోట్లు, ధన్వాడ-బూడిదపల్లి వరకు రూ.3.95 కోట్ల నిధులు మంజూరవగా సీఆర్‌ఆర్ నిధుల నుంచి కేటాయించారు. రహదారులకు నిధుల మంజూరుపై ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు మండల కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ రౌండ్ టేబుల్ సమావేశం

భూపాలపల్లి, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో శనివారం మధ్యాహ్నం 2 గంటలకు తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో తీసుకొస్తున్న మార్పులు, వాటి పర్యవసనాలు, విద్యారంగ బలోపేతానికి చేపట్టాల్సిన చర్యలు, తదితర అంశాలపై సమావేశంలో చర్చించనున్నారు. సమావేశానికి సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ కె.లక్ష్మీనారాయణ, డీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.లింగారెడ్డి, టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్.తిరుపతి ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారు. సమావేశానికి జిల్లా నుంచి విద్యావేత్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థి సంఘాల నాయకులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

క్రికెట్ పోటీల విజేతలకు బహుమతి ప్రదానం



కాటారం, న్యూస్‌టుడే : ధన్వాడలో నిర్వహించిన దుద్దిళ్ల శ్రీపాదరావు స్మారక ధన్వాడ ప్రీమియర్ లీగ్(డీపీఎల్)-9 క్రీడా పోటీలు శుక్రవారం ముగిశాయి. ఆద్యంతం ఉత్కంఠగా సాగిన క్రికెట్ తుది పోరులో మహి-333 జట్టు రాణించి ప్రథమ స్థానం, సాన్వి జట్టు ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నాయి. విజేతలకు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు చీమల సందీప్‌లు ట్రోఫీలు, బహుమతులను అందజేశారు. గెలుపోటములు సహజమేనని, క్రీడల్లో రాణిస్తే గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు.